క్లుప్తంగా

బాలికలు ఉన్నత స్థితికి ఎదగాలి



బేటీ బచావో.. బేటీ పడావో కార్యక్రమంలో విద్యార్థులు, పరిశీలకులు

సారంగాపూర్: ప్రతీ బాలిక చదువుతో ఉన్నత స్థితికి ఎదగాలని అధికారులు పేర్కొన్నారు. బేటీ బచావో.. బేటీ పడావో కార్యక్రమంలో భాగంగా గురువారం సారంగాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో కంప్యూటర్ శిక్షణ (పీజీడీసీఏ) అమలు తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, బాలికలకు కంప్యూటర్‌లో శిక్షణ ద్వారా రానున్న రోజుల్లో మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. శిక్షణ ఏ విధంగా అమలు చేస్తున్నారన్న దానిపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమశాఖ అందించే సేవలు, మహిళా సాధికారత, హెల్ప్‌లైన్ నంబర్లు తదితర అంశాలపై సుదీర్ఘంగా వివరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రమేశ్, ప్రధానోపాధ్యాయుడు బి.కిషోర్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పి.లత, మహిళా సాధికారత బృందం సభ్యులు గౌతమి, హేమశ్రీ తదితరులు పాల్గొన్నారు.

సెంట్రల్ సెన్సార్ బోర్డు సభ్యుడిగా శ్రీనివాస్



ధర్మపురి: సెంట్రల్ సెన్సార్ బోర్డు సభ్యుడిగా ధర్మపురికి చెందిన పిల్లి శ్రీనివాస్‌ను నియమించినట్లు హైదరాబాద్ సెంట్రల్ బోర్డు ఆఫ్ ఫిలిం సర్టిఫికెట్ కార్యాలయం నుంచి గురువారం ప్రకటన విడుదలైంది. శ్రీనివాస్ విద్యార్థి నాయకుడిగా, ఖమ్మం జిల్లా ఏబీవీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా, విశాఖపట్నం విభాగాల్లో పని చేశారు. ఆదిలాబాద్ జిల్లా బీజేవైఎం ఇన్‌చార్జి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా పని చేసి ప్రస్తుతం జిల్లా కార్యదర్శిగా కొనసాగుతూ సెన్సార్ బోర్డు సభ్యుడిగా నియమించబడ్డారు. ఈసందర్భంగా బీజేపీ రాష్ట్ర, జిల్లా నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

అంధ కళాకారుడు సందయ్యకు సన్మానం



సన్మానిస్తున్న ఎస్‌ఎంసీ చైర్మన్, ఉపాధ్యాయులు

కథలాపూర్: మండలంలోని భూషణరావుపేట ప్రభుత్వ పాఠశాలలో గురువారం అంధ కళాకారుడు సందయ్యను ఉపాధ్యాయులు, విద్యార్థులు సన్మానించారు. కోరుట్ల మండలం అయిలాపూర్‌కు చెందిన సందయ్య స్థానిక పాఠశాల విద్యార్థులకు సామాజిక సేవ అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం జానపద పాటలు పాడి విద్యార్థుల్లో ఉత్సాహం నింపారు. ఈసందర్భంగా ఉపాధ్యాయులు, విద్యార్థులు కలిసి కళాకారుడికి ఆర్థికసాయం అందించి సన్మానించారు. కార్యక్రమంలో ఎస్‌ఎంసీ చైర్మన్ గడ్డం చిన్నారెడ్డి, హెచ్‌ఎంలు రాజయ్య, విష్ణు, సాయిదివ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శ్రీవారికి మొక్కు చెల్లించుకున్న కాంగ్రెస్ నాయకులు



మొక్కు చెల్లించుకున్న నాయకులు

మేడిపల్లి: వేములవాడ నియోజకవర్గ ఎమ్మెల్యేగా ఆది శ్రీనివాస్ గెలుపుతో భీమారం మండలం గోవిందారం గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు తిరుమల తిరుపతి వేంకటేశ్వర స్వామికి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో వేములవాడ నియోజకవర్గ గల్ఫ్ కన్వీనర్, ఎన్నారై ప్యాట నారాయణ, తోకల నర్సయ్య, పుల్లూరి దేవయ్య, వనపర్తి గంగారం, కుంట గంగారం, చిపిరిశెట్టి రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ బకాయిలు చెల్లించాలి



రికార్డులు పరిశీలిస్తున్న రాజారెడ్డి

వెల్గటూర్: వినియోగదారులు విద్యుత్ బకాయిలను చెల్లించి సంస్థకు సహకరించాలని జగిత్యాల డివిజనల్ ఇంజినీర్ ఆపరేషన్ ఎ.రాజారెడ్డి అన్నారు. మండల కేంద్రంలో గురువారం వెల్గటూర్ సెక్షన్ కలెక్షన్ సెంటర్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ట్రాన్స్‌ఫార్మర్‌లు ఎక్కువ కాలిపోతున్నందున టీసీ ఫ్యూజ్‌లు వేయాలని, అనధికార లోడ్లను క్రమబద్ధీకరించాలన్నారు. రైతులు ఏడాదికి ఒకసారి చెల్లించే వ్యవసాయ విద్యుత్ సర్వీస్ చార్జెస్ రూ.360 విధిగా చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో వెల్గటూర్ ఏఈ శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

12 గంటలకే ఇంటికి..

- రాయికల్ ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యుల తీరు
- అడిగేవారు లేక సమయపాలన పాటించని వైనం
- ఇబ్బంది పడుతున్న రోగులు

రాయికల్: రాయికల్ వైద్య విధాన పరిషత్‌లో పని చేస్తున్న వైద్యులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తూ సమయపాలన పాటించకపోవడంతో ఆస్పత్రికి వచ్చిన రోగులు ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి నెలకొంది. రాయికల్ పట్టణంతో పాటు, మండలంలోని 32 గ్రామాలకు చెందిన నిరుపేదలకు వైద్యసేవలు అందించేందుకు 30 పడకల ఆస్పత్రి నుంచి వైద్య విధాన పరిషత్‌గా అప్‌గ్రేడ్ చేశారు. రోగులు అందించిన సమాచారం మేరకు 'సాక్షి' గురువారం ఉదయం 11.45 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఆస్పత్రిని సందర్శించింది.

ఇష్టారాజ్యంగా విధులు

వైద్య విధాన పరిషత్‌లో విధులు నిర్వహించాల్సిన వైద్యులు నిబంధనల ప్రకారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు ఆస్పత్రిలో ఉండి ఓపీ చూడాల్సిన బాధ్యత ఉంటుంది. కానీ, రాయికల్ ఆస్పత్రిలో విధులు నిర్వహిస్తున్న డీజీవో ఒడ్నాల రజిత, రేడియాలజిస్ట్ సురేందర్, మెడికల్ ఆఫీసర్ తేజస్విని ఉదయం 11.30 గంటల్లోపే ఆస్పత్రి నుంచి వెళ్లడంతో పిల్లల వైద్య నిపుణులు శిల్ప, మెడికల్ ఆఫీసర్ ఉదయ్ మాత్రమే రోగులకు వైద్యం చేయాల్సిన పరిస్థితి నెలకొంది.



గురువారం మధ్యాహ్నం 12 గంటలకు ఖాళీగా ఉన్న స్త్రీల వైద్య నిపుణురాలి టేబుల్

ముఖ్యంగా మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన గర్భిణులు వైద్య పరీక్షల కోసం ఆస్పత్రికి వస్తే స్త్రీ వైద్య నిపుణులు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా రేడియాలజిస్ట్ సైతం ఇష్టానుసారంగా విధులు నిర్వహిస్తున్నారని ఆరోపణలున్నాయి. ఆస్పత్రిలో వైద్యులు సరిగా ఉండకపోవడంతో గర్భిణులు ప్రసవాల కోసం జగిత్యాల పట్టణానికి వెళ్లాల్సిన పరిస్థితి నెలకొందని పేర్కొంటున్నారు.



రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ శిల్ప

తగ్గుతున్న ప్రసవాలు

రాయికల్ ఆస్పత్రిలో వైద్యులు ఇష్టానుసారంగా విధులు నిర్వహించడంతో గర్భిణులు వైద్యం కోసం రావడానికి భయపడాల్సిన పరిస్థితి నెలకొంది. ఏ సమయంలో వైద్యులు ఉంటారో, ఉండరో తెలియక ఇబ్బందులు పడుతున్నామని, దీంతో ప్రసవాల కోసం జగిత్యాలకు వెళ్తున్నామని గర్భిణులు వాపోతున్నారు. అక్టోబర్‌లో 14, నవంబర్‌లో 24, డిసెంబర్‌లో గురువారం వరకు 16 మాత్రమే ప్రసవాలు జరిగాయి. వైద్య విధాన పరిషత్‌లో వైద్యుల పనితీరు సక్రమంగా లేకపోవడంతో ప్రసవాల సంఖ్య తగ్గుతోందని వాపోతున్నారు. పర్యవేక్షించాల్సిన అధికారి వైద్యులకే వత్తాసు పలకడంతో పాటు, ఈ వైద్య విధాన పరిషత్ డీఎంహెచ్‌వో పరిధిలో లేకపోవడంతో తమను అడిగేవారే లేరని ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

వైద్యం కోసం వస్తే డాక్టర్ లేరు



వైద్యం కోసం ఒడ్డెలింగాపూర్ నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు రాయికల్ ఆస్పత్రికి వచ్చాను. తీరా ఇక్కడకు వచ్చాక డాక్టర్ లేకపోవంతో మళ్లీ ఒడ్డెలింగాపూర్‌కు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. పలు మార్లు వైద్యం కోసం వచ్చినప్పుడు సైతం డాక్టర్ లేకపోవడంతో ఇబ్బందులు పడ్డాం.

– దివ్య, గర్భిణి, ఒడ్డెలింగాపూర్

డాక్టర్లకు ఎన్నోసార్లు చెప్పాను



రాయికల్‌లో వైద్యుల పనితీరుపై ఎన్నోసార్లు వైద్యులకు చెప్పి చూశాను. అయినా ఫలితం లేకుండా పోయింది. ఈ విషయంపై ఉన్నతాధికారులకు సైతం నివేదించాం. అయినా వారి పనితీరు మారలేదు.

– రవికుమార్, ఆస్పత్రి సూపరింటెండెంట్, రాయికల్

డంపింగ్‌యార్డును తరలించండి



కాలనీవాసులతో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ హన్మండ్లు

రాయికల్: పట్టణంలోని ఒడ్డెరకాలనీ సమీపంలో గల డంపింగ్‌యార్డును మరోచోటకు తరలించాలని డిమాండ్ చేస్తూ గురువారం డంపింగ్‌యార్డుకు వస్తున్న ట్రాక్టర్లను కాలనీవాసులు అడ్డుకున్నారు. విషయం తెలుసుకున్న మున్సిపల్ చైర్మన్ మోర హన్మండ్లు కాలనీవాసులతో మాట్లాడారు. ప్రభుత్వ స్థలాన్ని గుర్తించి మరో చోటకు తరలిస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. ఆయన వెంట కౌన్సిలర్లు మహేందర్, శ్రీధర్‌రెడ్డి, అనిల్, ధర్మపురి తదితరులు ఉన్నారు.

దుర్వాసనతో విద్యార్థుల ఇబ్బందులు

ఇబ్రహీంపట్నం: మండలకేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో మురికినీరు బయటకు వెళ్లకుండా నిలిచిపోవడంతో దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నామని విద్యార్థులు పేర్కొంటున్నారు. కేజీబీవీని గ్రామశివారులోని ఎస్సారెస్పీ స్థలంలో నిర్మించడంతో పాఠశాల మురికినీరు, సెప్టిక్ ట్యాంక్ నీళ్లు బయటకు వెళ్లేందుకు మురికి కాలువలు లేవు. సదరు ఎస్సారెస్పీ స్థలంలో ఎస్సీ, బీసీ, బాలుర హాస్టళ్లు, ప్రభుత్వ జూనియర్ కళాశాల నిర్మించారు. మురికి నీరు పోయేందుకు పాఠశాల వెనుకవైపు తాత్కాలికంగా ఇంకుడుగుంత నిర్మాణం చేపట్టగా, అది నిండిపోవడంతో నీరు నిలిచి దుర్వాసన వస్తుందని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాగా ఇంకుడుగుంత నుంచి నీరు బయటకు



కస్తూరిబాగాంధీ విద్యాలయం వెనుకవైపు మురికినీటితో నిండిపోయిన ఇంకుడుగుంత

వెళ్లకుండా పక్కనే ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నట్లు కేజీబీవీ ప్రత్యేకాధికారి రజిత తెలిపారు. వెంటనే అధికారులు స్పందించి మురికి కాలువలు నిర్మించి నీరు వెళ్లేలా చర్యలు చేపట్టాలని కోరారు.

సాయి ఆలయంలో దత్త జయంతి

కోరుట్లరూరల్: పట్టణ శివారులోని సాయిరామా ఆలయంలో గురువారం దత్త జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా 108 మందితో సామూహిక గురుచరిత్ర పారాయణం, మహాయజ్ఞం ప్రారంభించారు. గణపతిపూజ, పుణ్యాహవచనం, గోపూజ కంకణధారణ, అష్టోత్తర శతకలశ స్థాపన, దత్తాత్రేయస్వామికి అభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణ అధికారి వి.అనూష, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

ముక్కోటి ఏకాదశికి రండి

జగిత్యాలరూరల్: జగిత్యాల అర్బన్ మండలం అంబారిపేట శివారులోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో ముక్కోటి ఏకాదశి వైకుంఠ ద్వార దర్శనానికి హాజరు కావాలని జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంతకు ఆలయ చైర్మన్ మల్లేశం, సర్పంచ్ గంగాధర్ గురువారం ఆహ్వానపత్రిక అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు రమేశ్, జలేందర్ పాల్గొన్నారు.



జెడ్పీ చైర్‌పర్సన్ వసంతకు ఆహ్వానపత్రిక అందజేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

దళితబంధు యూనిట్ల పరిశీలన

ఇబ్రహీంపట్నం: మండల కేంద్రంలో దళితబంధు కింద మంజూరైన యూనిట్లను గురువారం ఎస్సీ కార్పొరేషన్ ఈడీ లక్ష్మీనారాయణ పరిశీలించారు. పోడేటి శేఖర్ గొర్రెల పెంపకం యూనిట్, జిల్లాపెల్లి రాజేందర్ ఎలక్ట్రికల్ షాప్‌ను సందర్శించి లబ్ధిదారులు ఏ విధంగా వినియోగించుకుంటున్నారో తెలుసుకొని సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో ప్రభు, ఎంపీవో కృపాకర్ తదితరులు పాల్గొన్నారు.



గొర్రెల యూనిట్‌ను పరిశీలిస్తున్న లక్ష్మీనారాయణ

కాంగ్రెస్ ఎంపీల వ్యాఖ్యలపై బీజేపీ నిరసన



కోరుట్లలో నిరసన తెలుపుతున్న బీజేపీ నాయకులు



కథలాపూర్‌లో..

మెట్‌పల్లి/కథలాపూర్/కోరుట్ల/పెగడపల్లి: పార్లమెంట్‌లో ఉపరాష్ట్రపతిపై కాంగ్రెస్ ఎంపీలు వ్యవహరించిన తీరుపై గురువారం బీజేపీ నాయకులు నల్ల బ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ, రాజ్యసభలో రాహుల్ వ్యవహరించిన తీరు సరికాదన్నారు. ఆయన వెంటనే క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. మెట్‌పల్లిలో చేపట్టిన నిరసనలో బొడ్ల రమేశ్, చెట్లపల్లి సుఖేందర్, ఇల్లెందుల శ్రీనివాస్, దొనికెల నవీన్, కొండ్లెపు శ్రీనివాస్, సుంకేట విజయ్, కొయ్యల లక్ష్మణ్, కథలాపూర్ మండలాధ్యక్షుడు కంటె సత్యనారాయణ, గండ్ర అజయ్‌రావు, వెంకటేశ్వర్‌రావు, మామిడిపెల్లి ప్రవీణ్, మల్యాల మారుతి, కాసోజి ప్రతాప్, మహేశ్, సత్యం, ప్రణీత్‌గౌడ్, రణధీర్, రాజాగౌడ్, ప్రమోద్ పాల్గొన్నారు. కోరుట్ల కార్గిల్ చౌక్ వద్ద చేపట్టిన నిరసనలో పోతుగంటి శ్రీనివాస్‌గౌడ్, పీసరి నర్సయ్య, తిరుమల వాసు, సుదవేణి మహేశ్, ఆకుల రంజిత్, పంచిరి విజయ్, కలాల సాయిచంద్, రాజేందర్, పెగడపల్లిలో గంగుల కొమురెల్లి, నరేందర్, చింతకింద కిశోర్, వరదరాం, దామోదర్, మల్లేశ్, అనిల్, రాజేశం పాల్గొన్నారు.

సమాజంలో అందరూ సమానమే

జగిత్యాల: సమాజంలో అందరూ సమానమేనని, ప్రతి ఒక్కరూ ప్రభుత్వ పథకాలకు అర్హులేనని చేతన సంస్థ అధ్యక్షుడు శివకుమార్ అన్నారు. గురువారం జగిత్యాలలో చేతన స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ట్రాన్స్‌జెండర్లకు సామాజిక భద్రత కార్డులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వ పథకాలకు అర్హులైన అందరూ ఆధార్‌కార్డులు, రేషన్‌కార్డులు పొందాలన్నారు. ఏయే సర్టిఫికెట్లు కావాలో తమ ద్వారా సాయం చేస్తామని పేర్కొన్నారు. అనంతరం ట్రాన్స్‌జెండర్లు మాట్లాడుతూ, తమకు ఈ అవకాశం కల్పించడం అభినందనీయమని అన్నారు.



అవగాహన కల్పిస్తున్న శివకుమార్

కార్యక్రమంలో ట్రాన్స్‌జెండర్లు నిహారిక, ప్రశాంతి, జానుషేక్ తదితరులు పాల్గొన్నారు.

ముక్కోటి ఏకాదశికి సిద్ధం

జగిత్యాలరూరల్: ముక్కోటి ఏకాదశి పురస్కరించుకుని జగిత్యాల అర్బన్ మండలం అంబారిపేట గ్రామశివారులోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో ఉత్తర ద్వార దర్శనం కోసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆలయంలో విద్యుద్దీపాలంకరణతో పాటు, మౌలిక వసతులు కల్పించారు.

నేడు శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి కల్యాణం

జగిత్యాలజోన్: జగిత్యాల రూరల్ మండలం లక్ష్మీపూర్ గ్రామంలో శుక్రవారం శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి కల్యాణం వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు. కల్యాణోత్సవం అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు. అలాగే, శనివారం ఆలయంలో ఉత్తర ద్వార దర్శనం ఉంటుందని తెలిపారు.

ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేయాలి

మెట్‌పల్లి: గ్రామీణ ప్రాంత విద్యార్థుల కోసం ఆర్టీసీ ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేయాలని కోరుతూ గురువారం ఏబీవీపీ నాయకులు అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఉచిత ప్రయాణం వల్ల బస్సుల్లో రద్దీ పెరగడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఈ సందర్భంగా వారు వివరించారు. దీనిని దృష్టిలో పెట్టుకొని ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసి విద్యార్థులను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో నగర కార్యదర్శి అరవింద్, వెంకట్, మారుతి, జావేద్, ఈశ్వర్ తదితరులున్నారు.

రైతుల డబ్బుతో కాలువ పనులు పూర్తి

సారంగాపూర్: కాలువ మరమ్మతుకు రైతులు డబ్బు చెల్లిస్తే.. అధికారులు పర్యవేక్షించడంతో గురువారం పనులు పూర్తయ్యాయి. సారంగాపూర్, బట్టపల్లి, పోతారం గ్రామాలకు శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుంచి నీరు అందించే డీ–53, 12ఎల్ 1ఆర్ కాలువకు వర్షాకాలంలో భారీ వరదల కారణంగా పలుచోట్ల గండ్లు పడ్డాయి. కొన్ని చోట్ల కొంత గండ్లు కొట్టారు. దీంతో యాసంగికి ఆయా గ్రామాల్లోని పంట పొలాలకు సాగునీరు చేరడం కష్టతరంగా మారింది. మరమ్మతులు చేపట్టడానికి తమ శాఖలో డబ్బులు లేవని ఇంజినీరింగ్ అధికారులు పేర్కొనడంతో రైతులే డబ్బు చెల్లించారు. అధికారులు పర్యవేక్షించగా రైతులు జేసీబీ, ట్రాక్టర్ల సహాయంతో మరమ్మతులు పూర్తి చేశారు. కాగా అధికారులు డబ్బులు లేవనడంపై పలువురు రైతులు ఫోన్‌లో ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డికి ఫిర్యాదు చేయగా, రైతులకు నష్టం జరగకుండా చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్సీ హామీ ఇచ్చారు.



కాలువకు మరమ్మతు చేయిస్తున్న అధికారులు

మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

ధర్మపురి: ధర్మపురి మున్సిపల్ కార్యాలయంలో గురువారం చైర్‌పర్సన్ సంగి సత్తమ్మ అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. పట్టణంలో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులు, వాహనాల రిపేరింగ్, బ్లీచింగ్ పౌడర్, వస్తువుల కొనుగోళ్లు, తదితర 21 అంశాలను సమావేశంలో ఆమోదించారు. వైస్ చైర్మన్ రామన్న, కమిషనర్ రమేశ్, కౌన్సిలర్లు, మేనేజర్ గంగాధర్ పాల్గొన్నారు.

జేసీబీ, ట్రాక్టర్ల పట్టివేత

మెట్‌పల్లి: పట్టణ శివారులోని వెంకట్రావుపేట సమీపంలో గుట్ట నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా మట్టి తవ్వకాలు చేపడుతున్న వాహనాలను పట్టుకున్నట్లు మెట్‌పల్లి ఎస్సై చిరంజీవి తెలిపారు. గురువారం మట్టి తవ్వకాలు చేపడుతున్న జేసీబీ, మట్టి తరలిస్తున్న 5 ట్రాక్టర్లను పట్టుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించామని, తదుపరి చర్యల నిమిత్తం తహసీల్దార్‌కు అప్పగించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

5వ తరగతిలో ప్రవేశ పరీక్షకు దరఖాస్తులు

ధర్మపురి: సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో 2024–25 విద్యా సంవత్సరానికి గాను 5వ తరగతి ఇంగ్లిష్ మీడియంలో ప్రవేశానికి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సాంఘిక సంక్షేమ గొల్లపెల్లి (మగ్గిడి) గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ రాజమణి గురువారం తెలిపారు. ప్రస్తుతం 4వ తరగతి చదువుతున్న విద్యార్థులు అర్హులని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంత విద్యార్థుల తల్లిదండ్రుల వార్షికాదాయం రూ.1లక్షా 50 వేలు, పట్టణ ప్రాంత విద్యార్థుల తల్లిదండ్రుల వార్షికాదాయం రూ.2 లక్షలు ఉండాలని తెలిపారు.

అధునాతన పరికరాలతో వైద్యపరీక్షలు

సారంగాపూర్: గ్రామాల్లో అధునాతన పరికరాలతో వైద్యపరీక్షలు నిర్వహించి, అవసరమున్న వారికి ఉచిత వైద్యం అందించడం జరుగుతుందని జిల్లా మాతా శిశు సంక్షేమాధికారి డాక్టర్ జయపాల్‌రెడ్డి అన్నారు. వికసిత్ భారత్ సంకల్ప్ యాత్రలో భాగంగా గురువారం మండలంలోని మ్యాడారంతండా, బట్టపల్లి గ్రామాల్లో జరిగిన కార్యక్రమాల్లో మాట్లాడారు. వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర కార్యక్రమం కింద వైద్య బృందాలు గ్రామాలకు వస్తున్నాయని, క్షయ, రక్తహీనత, క్యాన్సర్, మధుమేహం, రక్తపోటు వంటి వ్యాధులతో బాధపడేవారికి ఇక్కడే పరీక్షలు నిర్వహించి, అవసరమున్న వారికి ఆధునిక వైద్య చికిత్సల కోసం ప్రభుత్వ వైద్యశాలలకు పంపించడం జరుగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో 100 మందికిపైగా వైద్య పరీక్షలు చేయించుకున్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాజేందర్, ఏఎన్‌ఎంలు, వైద్యసిబ్బంది, ఆశాలు పాల్గొన్నారు.



మ్యాడారంతండాలో అధికారులు, సిబ్బంది

ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణాన్ని సవరించాలి

మల్యాల: కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీల్లో భాగంగా మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత బస్సు సౌకర్యాన్ని కేవలం తెల్లరేషన్‌కార్డు మహిళలకు మాత్రమే కల్పించాలని ధర్మ సమాజ్ పార్టీ ప్రతినిధులు అన్నారు. మండల కేంద్రంలో గురువారం స్థానిక తహసీల్దార్ మునీందర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఉద్యోగం చేస్తున్న మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించవద్దని కోరారు. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణంతో ఆటో కార్మికులు ఆర్థికంగా తీవ్రంగా నష్టపోతున్నారని, ప్రతీ ఆటో కార్మికుడికి నెలకు రూ.3,000 చొప్పున ఆర్థిక సాయం అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ధర్మ సమాజ్ పార్టీ ప్రతినిధులు ఉపేంద్ర, శివ, ప్రణయ్, అజయ్, ప్రణీత్, ప్రశాంత్ పాల్గొన్నారు.



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ధర్మ సమాజ్ పార్టీ నాయకులు

రుణ దరఖాస్తుల పరిశీలన

మల్లాపూర్: మండలంలోని రేగుంట గ్రామంలో గురువారం శ్రీలక్ష్మి గ్రామైక్య సంఘం పరిధిలోని 7 స్వయం సహాయక సంఘాల సమావేశం నిర్వహించారు. ఇదివరకు రుణాల కోసం దరఖాస్తు చేసుకున్నవారి పత్రాలను అధికారులు పరిశీలించారు. బ్యాంకు లింకేజి ద్వారా ఇండియన్ బ్యాంక్ మేనేజర్ నరేశ్ రూ.70 లక్షల రుణాలు మంజూరు చేశారు.

నూతన కార్యవర్గం

మేడిపల్లి: ఉమ్మడి మేడిపల్లి ప్రెస్‌క్లబ్ నూతన కార్యవర్గాన్ని గురువారం మండల కేంద్రంలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా నోముల నరసింహారెడ్డి, ప్రధాన కార్యదర్శి పుప్పాల రాంరెడ్డి, ఉపాధ్యక్షుడు మార్గం మహేశ్, క్యాషియర్ ఎదులాపురం దయాకర్, కార్యదర్శి నీలగిరి ప్రవీణ్, ఆర్గనైజింగ్ సెక్రటరీ రహీమ్, కార్యవర్గ సభ్యులు చిరుమల్ల వజ్రలింగం, గొడిశె సాయికృష్ణ, బొంగోని మల్లేశం, బక్కూరి నరేశ్, కుందారపు ప్రభాకర్, పల్లికొండ గణేశ్, తదితరులను ఎన్నుకున్నారు.